# వలజారిన చేప

అతను ఇంటికి వచ్చేసరికి ఎప్పటిలాగానే ఇల్లు ప్రశాంతంగా వుంది. రక రకాల టెన్షన్ల మధ్య పగలంతా అతనికి హెవీగా వుంటుందిట. అంచేత రాత్రిళ్ళు అతను ఎంత పొద్దుపోయి ఇంటికి వచ్చినా ఇల్లూ, మనుషులూ అందరూ ఫ్రెష్‌గా కనిపించాలి. వచ్చేముందు ఫోన్ చేస్తాడతను. నీడలు తేలుతున్న మొజాయిక్ ఫ్లోరింగ్....గాలికి మెల్లగా కదిలే అందమైన, స్వచ్ఛమైన తెల్లని తెరలు....ఎక్కడా మరకలు కనిపించకూడదు· చిట్టిబాబు వీణవాదనం అతినెమ్మదిగా వినిపిస్తూ వుండాలి. పనివాళ్ళు నిద్రమొహాల్తో వుండకూడదు. తను చేసే భోజనం చాలా తక్కువ వేడిగా వుండాలి. జాలి జాలి కబుర్లు, కష్టాలు, విసుగులు, చిరాకులు ఎవరూ విని పించకూడదు. ఇదంతా శాంతే చూస్తుంది. పగలంతా తాను పిల్లలతో తిప్పలుపడినా, వాళ్ళకి జ్వరాలొచ్చినా, తనకు ఒళ్ళు నొచ్చినా తనే సర్దుకుంటుంది

'చంద్రశేఖర్' ది గ్రేట్ బిజినెస్ మాన్ భార్య పాత్ర ధరించటం అంటే మాటలా మరి. చెరగని చిరునవ్వుతో అతని అవసరాలన్నీ చూశాక, విశాలమైన పడక గదిలో లైట్ వెలుగుతుంటే అతను ఇంకా ఆఫీస్ పని చేసుకుంటున్నట్లు! నీలికాంతి గదినిండా పరుచుకుంటే తనను లోపలికి రమ్మన్నట్లు లెక్క. అయితే ఆ రోజుమటుకు అప్పటివరకూ అతికించుకున్న చిరునవ్వు ఎందుకో చంద్రశేఖరం గదిలో నీలిరంగు పరుచుకున్నాక ఆరిపోయింది. అతి మెత్తని సిల్కు చీరె, చంద్ర శేఖర్ చాలా ఇష్టపడే సెంటు పరిమళం, సంపెంగలు, మల్లెలు, గదంతా పరచుకున్న అనుభూతి తెస్తుంటే తను సన్నని గొంతుతో అతనికి నచ్చే కబుర్లు చెప్పటంతో ముగిసే ప్రతిరోజూ రివాజు ప్రకారం ఆ రోజు ముగిసిపోలేదు. శాంతి కళ్ళవెంట తెగిన ముత్యాల్లా కళ్ళనీళ్ళు జలజలమని కారిపోయాయి. చంద్రశేఖర్‌కు ఇదంతా నచ్చదు. 'జీవితం తన గుప్పిట్లోంచి ఎప్పుడూ జారిపోకూడదు' అనుకునే మనిషి ఆయన. శాంతి కన్నీళ్ళు ఆయన్ని కదిలించలేదు సరికదా తన సౌకర్యానికి భంగం కలగటం మాత్రం భరించలేకపోయాడాయన. విశాలమైన గదిలో గదిగోడలకు అందమైన చిత్రాలు, మల్లెపూల పడవలాంటి మెత్తని పడక, భార్య చిరునవ్వు,

చక్కని సంగీతం వీటన్నిటి మధ్య పగటి టెన్షన్ మరిచిపోయి రేపటి కోసం కొత్త శక్తి తెచ్చుకోవాలి మరి. తప్పదు. చిరాకు దాచిపెట్టి అసలు విషయం ఆరాతీస్తే శాంత వెక్కిళ్ళ మధ్య తేలిందిది. ఇవ్వాళ ఆయనకు ఓ ఉత్తరంవచ్చింది.మామూలు ఉత్తరమే. విశాఖలో ఆయన పి.ఎ. రాసింది. ఆ అమ్మాయి జానకిని శాంతి ఎరుగును. మంచి అమ్మాయి, తెలివైంది, భావుకురాలు, చంద్రశేఖర్ గారంటే ప్రేమ, గౌరవమూనూ. ఆయన బిజినెస్ చక్కగా చూస్తుంది. ఆయన ఇచ్చిన అతికొద్ది జీతం డబ్బునే మహాప్రసాదంలా వాడుకుంటుంది. ఆయనకు సంబంధించిన అనేకానేక బిజినెస్ వ్యవహారాలు ఉత్తరంలో రాస్తూ చివరగా తన సొంత విషయాలు చెప్పుకుంది రెండు మాటల్లో ఆయనతో తాను పంచుకున్న విశ్శబ్దానుభూతి తననెంత కల్లోలపెడుతోందో, కన్నీటి ధారలతో కడిగేసినా తన రెండు కళ్ళల్లో ఆయనబొమ్మ ఎంతగా చెరిగిపోకుండా తననెంత ఇబ్బంది పెడుతోందో రాసింది. ఆవిడకు ఏమీ అక్కరలేదు ఒక చల్లని పలకరింపూ, చంద్రశేఖర్ జీవితంలో తానూ వున్నానన్న సంతృప్తి తప్పించి. ఇందులో శాంతి బాధపడేందుకు ఏముందీ అందామని చంద్రశేఖర్‌కి అనిపించింది. కానయితే ఇందులో తిరకాసు కాసేపు ఆలోచించాక బోధపడింది. శాంతి "కన్విన్స్" కాకపోతే తన సౌకర్యాలు ఎన్నిపోతాయో గ్రహింపుకి వచ్చాక ఆయనకు గాబరా వచ్చింది. ఏదీ ఆ ఉత్తరం ఇలాగిమ్మని తానుస్వయంగా చదివి చూశారు.

'కళ్ళనీళ్ళతో ఎన్నిసార్లు కడిగేసినా కళ్ళల్లో నీ బొమ్మ చెరిగిపోవటంలేదు చంద్రా....'

జానకి నిజంగానే తడి కళ్ళతో ప్రతి అక్షరంలోనూ కనిపించింది. ఆ అమ్మాయిని కదిలించి తాను పొరపాటు చేశాడేమో అని అనుమానం వచ్చింది. డామిట్.... చంద్రశేఖర్ పొరపాట్లు చేయడుగాక చేయడు. ఆ అమ్మాయి అలా టెక్కుగా ఎవర్నీ లెక్కచేయనట్లు వుండటం తనకు ఎంతమాత్రం నచ్చలేదు. తానెంత అందమైనవాడు. హాలీవుడ్ స్టార్స్ బలాదూర్. తనకెంత డబ్బు! కుబేరుడు గులామ్! ఏమిటో ఈ పిలకజడ పిల్ల అంత కేర్‌నాట్‌గా వుండటం. ఓసారి ఆలోచన వచ్చాక ఆయనకు నిద్రపట్టలేదు. శాంతి మంచి ఇల్లాలు సరే....సేవలు చేస్తుంది. పాపం బాగానే వుంటుంది, పిల్లల్ని కని శుభ్రంగా పెంచుతోంది. అయితే తన బిజినెస్ టెన్షన్స్ పోటీ ప్రపంచాన్ని తట్టుకునేందుకు తాను తీస్తున్న పరుగులు, ఇందుకు తనకు అవసరమైన సలహాలు, ఇవ్వన్నీ కళ్ళజోడు ముక్కుమీదకు జార్చుకుంటూ తెలివైన కళ్ళతో ప్రపంచాన్ని చదివేయగల జానకి మాత్రమే ఇవ్వగలదు. తాను కుంగిపోతే ఓదార్చి సేద తీర్చగలదు. ఈ జానకిని తాను గెలుచుకోలేదా?! ఒకటి

రెండేళ్ళపాటు ప్రయాస. జానకి ఇక తట్టుకోలేకపోయింది. ప్రేమతో తాను వేసిన గాలంలో పడకపోయేందుకు జానకి కొరమీను కాదు. ఒట్టి చేప. తన మానసిక ప్రపంచంలో శాంతికి చోటులేదని తాను చెప్పగా, చెప్పగా తెలుసుకొని జానకి మెత్త పడింది. తండ్రి లేడు, తల్లి కష్టపడి పెంచింది. నా అనే దిక్కు ఆ ముసలామె ఒక్కతేనట. పూనుకొని పెళ్ళిచేసేవాళ్ళు లేరు. తల్లి బాధ్యత కూతురుదయింది. మొగాడిలా బ్రతుకు ఈడుస్తోంది. చంద్రశేఖర్ వంటి రాకుమారుడికి జానకి దాసో హం అనటం గొప్పా? కానీ జానకి పట్టి చేపమాత్రమే కాదు. చంద్రశేఖర్ వ్యాపార కేంద్ర బిందువు. ఆలోచన ఒక పట్టాన తెగలేదు చంద్రశేఖర్‌కి. శాంతా? జానకా? ఎవరిని నొప్పించాలి. చిట్టచివరకు ఫోన్ చేతిలోకి తీసుకుని శాంతిని లాలించి దగ్గ రకు తీసుకొని వైజాగ్‌లోవున్న జానకిని లేవగొట్టాడు...."ఉత్తరం శాంతి అందు కుంది" అన్నాడు ఉపోద్ఘాతం లేకుండా.

జానకి ఉలిక్కిపడింది.

"అయ్యో! నేనలా ఊహించలేదు. లెటర్స్ అన్నీ మీరే చూస్తారుగా. ఇదెలా జరిగింది?" అన్నది బాధపడుతూ.

"నేను టూర్‌లోవున్నా. శాంతి తీసుకుంది. అయినా అవేం రాతలు"అన్నాడు చంద్రశేఖర్.

"పక్కనే శాంతి వుందా చంద్రా!" అన్నది జానకి.

చంద్రశేఖర్ ఇబ్బందిగా శాంతివైపు చూశాడు.

"అవును తను చాలా బాధపడింది. యూనో, షి నోస్ మై సిన్సియారిటీ షి ఈజ్ వెరీ ఇంటిలిజంట్...." అన్నాడు చంద్రశేఖర్ తొణక్కుండా.

జానకి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. వణికిపోతున్న పెదవులు పళ్ళతో కరిచి పట్టుకొని "నేను ఏం చేయలేదే. నేనెవ్వరికీ కష్టం కలిగించలేదు. నేనే నష్టపోయాను తప్పితే...."

"నీ కన్నీ తెలుసు" అన్నాడు కాస్త కటువుగా.

అవునన్నది జానకి.

"దీన్ని ఇంతటితో ఎందుకు ఆపేయకూడదు" అన్నాడు ఇంగ్లీషులో. అతని ఇంగ్లీషు యాక్సెంట్ చాలా బావుంటుంది - కాసిని తప్పులున్నా.

"ఇది జరిగేవరకూ మీరూ తాపత్రయపడ్డారు. ఆపేయ్యాలని ఇప్పుడు అనిపిం చిందా...." అన్నది జానకి. చంద్రశేఖర్ తనతో చెప్పిన కలిసి స్వేచ్ఛగా జీవించి

కొత్తరకం "సంసారం" పునాదులు పడిపోవటం స్పష్టంగా కళ్ళముందు కనిపించిం దామెకు. పిల్లలూ జంఝాటంపెట్టుకోవద్దు. ఇద్దరికీ ఎవరి జీవితం వాళ్ళకే వుంటుంది. జస్ట్ మోరల్ కంపానియన్‌షిప్.... ఇదిగిదిగో ఇలా బ్రేక్ వచ్చిందన్నమాట.

జానకి మాట్లాడలేదు. చంద్రశేఖర్‌కి ఉత్తరంలో రాసిన మాటల్లో అబద్ధం లేదు. తన కళ్ళలో చంద్రశేఖర్ అందమయిన నవ్వు ముఖం నిజంగా చెరిగిపోక పోవటం తను బతికి వున్నంత నిజం.

ఫోన్ పెట్టేసి చంద్రశేఖర్ శాంతితో చాలాసేపు మాట్లాడాడు. జానకిది ఇమోషనల్ మెంటాలిటీ. తాను చూపిన అభిమానాన్ని ఇంకోరకంగా అపార్థం చేసుకుంది. తాను రోజుల తరబడి వంటరిగా వైజాగ్‌లో వుండిపోవటం శాంతి దగ్గర లేకపోవటం,తన ఏకాంతం,ఆ సమయంలో జానకిపరిస్థితి ఆవిడ ఇబ్బందులువినటం. తనది స్వతహాగా జాలి గుండె. కరిగిపోకుండా ఎలా వుంటుంది. అంతేగానీ శాంతికి కలలోనైనా ద్రోహం చేస్తే ఆయన మనసు చెదిరిపోతుంది. ఏకాగ్రత దెబ్బతినేస్తుంది. ఆయన ప్రతి పైసా సంపాదన శాంతి భవిష్యత్తు, పిల్లలు భావిజీవితం కోసమే. ఇలా చెప్పుకుపోతూ ఆయన చాలా డిస్టర్బ్ అయ్యాడు. నిద్రపట్టక చాలా ఇబ్బంది పడ్డాడు! శాంతి ఎప్పటిలా నవ్వాక మాత్రమే ఆయనకుపోయిన మనశ్శాంతి తిరిగి వచ్చింది. ఆయనకు నిద్ర పట్టింది. శాంతి హాల్లోకి వచ్చింది. ప్రక్కగదిలో నిద్రపోతున్న పిల్లల్ని చూసింది. నీడలు తేలుతున్న చల్లని పాలరాతి గచ్చు మీద చెప్పులులేని కాళ్ళతో వళ్ళు చల్లబడేదాకా పచార్లు చేసింది. తలుపులు తెరుచుకుని కారిడార్లో నిలబడి బంగళా చుట్టూవున్న అందమైన లాన్‌ను, వరసలవారీగా క్రమ పద్ధతిలో, ఒకే ఎత్తులో పెరిగిన అందమైన తోటను,విరగబూసిన పూలను చూసింది

జానకి వెక్కి వెక్కి ఏడుస్తుందేమోనన్న ఆలోచన ఆవిడ మెదడులో పుట్టి తన చుట్టూ ప్రతిధ్వనిస్తున్న భావన కలిగింది. కేవలం తన సౌకర్యానికి ఏదయినా భంగం కలుగుతుందేమోనని నటించిన అందమైన మొగుడినీ, తన స్వసుఖం ఆలోచించి పిల్లల భవిష్యత్తు అనే అందమైన అబద్ధపు ముసుగు వేసుకుని ఘోష పెడుతున్న మనస్సుని జోకొట్టి, చిరునవ్వు నవ్వేసి భర్తని నిద్రపుచ్చిన తన మహోన్నత నటనా వైదుష్యాన్ని గుర్తుతెచ్చుకున్నాక ఒక్కసారి విరగబడి నవ్వాలనిపించింది. చంద్రశేఖర్ భాషలో చెప్పాలంటే వెకిలిగా పడీ పడీ నవ్వాలనిపించింది. తెలుసు తనకు.... జానకి ఇంకెప్పటికీ చంద్రశేఖర్ జీవితంలోకి తొంగయినా చూడ లేదని. తన కెరీర్‌కు అడ్డం వస్తే, తన ప్రశాంతతకు భగ్నం కలిగిస్తే చంద్రశేఖర్ ఎంత మాత్రం సహించడు. చిట్టిబాబు వీణ వినిపించటం మానేసింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఏమీ మార్పులేదు. ఎప్పటిలాగే 15 సంవత్సరాల అలవాటులాగే

పిల్లల్ని వాళ్ళకి మెలుకువ రాకుండా సున్నితంగా ముద్దుపెట్టుకొని తన పెదవులమీద మొరటుగా ఇంకో ముద్దిచ్చి, రొమాంటిక్‌గా నవ్వి, "గుడ్‌బై డార్లింగ్" అని చెక్కిలి మీద చిటికవేసి....హిపోక్రసీ అతను నిద్రపోయాక అంతా ఎప్పటిలాగానే వుందా....?

"కళ్ళనీళ్ళతో ఎన్నిసార్లు కడిగినా నీ బొమ్మ చెరిగిపోవటంలేదు చంద్రా...."

'అందమైన అనుభూతిని మాటల్లో పెడితే ఇంత అద్భుతంగా వుంటుందా?....' జానకితో మాట్లాడితే....

చుట్టూ పరుచుకున్న చీకటి....మనసులోనూ కటిక చీకటి.

ఫోన్ ఒళ్ళో పెట్టుకుని జానకి కోసం నెంబర్లు తిప్పింది శాంతి.

"నేను శాంతిని...."

"చెప్పండి...." అన్నది జానకి.

"నేను ఎమ్మే లిటరేచర్ నీకు తెలుసుగా...."

నిట్టూర్చింది జానకి. "అవును తెలుసు. మీరు మంచి పొయిట్రీ రాస్తారు. నాకు చాలా ఇష్టం...."

"కొత్త పుస్తకం ఈ సంవత్సరం ఆఖరుకు వేస్తాను" అన్నది శాంతి.

"ఆ రోజు కవి సమ్మేళనంలో మిమ్మల్ని చూసేదాకా నాకు తెలియదు శాంతి మీరేనని. నేను మిమ్మల్ని ఇంకోలా ఊహించాను" అన్నది జానకి. చంద్రశేఖర్ తనతో చెప్పిన మోరల్ కంపానియన్‌షిప్ గుర్తుకొచ్చింది జానకికి.

"ఉద్యోగం మానుకోవద్దు జానకీ...."

జానకి మాట్లాడలేదు.

"మనం బహుశా కలుసుకోం. ఇంట్లో కేవలం చంద్రం సౌకర్యం కోసమే చాలా ఏర్పాట్లుంటాయి. నేను ఆ వ్యవహారంలో ఒక భాగం. ఇప్పుడు ఇంకా చాలా ఆలోచించవలసిన విషయాలున్నాయి. నేను చేయాల్సిన పనులు చాలా వున్నాయి. కొత్త స్కూల్ ఒకటి పెడతాను. నాకు టీచింగ్ చాలా ఇష్టం. ఏర్పాట్లవీ చూస్తాను. అన్నట్లు జానకీ! మనం ఫ్రెండ్స్!"

జానకి నవ్వింది.

"నన్ను బాధపెట్టిన ఓ బొమ్మ ఇప్పుడు నా కళ్ళల్లోంచి వెళ్ళిపోయింది. కన్నీళ్ళకి చాలా పవరుంది శాంతీ...."

శాంతి నవ్వేసింది ఆవిడకు ఎందుకో నవ్వు ఆగలేదు. చంద్రశేఖర్ ఎప్పుడూ ఇష్టపడని నవ్వు నవ్వుతోంది శాంతి. ఆ అందమైన నవ్వుని, ఆత్మవిశ్వాసపు నవ్వునీ, బాధనీ అనంత వేదననీ కలగలసిన ఆ నవ్వుని, జీవనాదంలా తాను చుట్టూ పరుచుకుంటున్న ఆ నవ్వుని వింటోంది జానకి.

(ఆదివారం ఆంధ్రజ్యోతి)